కన్నుపడితే కబ్జానే

కబ్జారాయుళ్లా.. మజాకా-2

భూ కబ్జాల పుట్ట పగులుతున్నది. తీగలాగితే డొంక కదిలిన చందంగా జగిత్యాల కేంద్రంగా కొన్నేళ్లుగా జరిగిన అక్రమాల బాగోతం రోజుకోచోట బయటపడుతున్నది. ప్రభుత్వ ప్రైవేట్ భూమి అన్నది లేకుండా.. అయినవాళ్లు, పరాయివాళ్లు అనే తేడా లేకుండా ఖాళీ భూమి కనిపిస్తే చాలు పాగా వేసిన పర్వాన్ని 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెస్తుండగా, బాధితులకు కొండంత ధైర్యం వస్తున్నది. కొద్దిరోజులుగా వరుస కథనాలతో అక్రమాల చిట్టా విప్పుతుండగా, గురువారం మరో కబ్జా పర్వం వెలుగులోకి తెచ్చింది. ఏకంగా బతికున్న మనిషికి డెత్ సర్టిఫికెట్ సృష్టించి, మేనమామను కన్నతండ్రిగా మార్చి 680 గజాల భూమిని మేన కోడలు అప్పనంగా అమ్మేసిందని, భార్య, కొడుకు ఉన్నా లేనట్టుగా తప్పుడు పత్రాలు సృష్టించి లక్షల విలువైన స్థలాన్ని కొట్టేశారని బాధిత కుటుంబం కన్నీటి పర్యంతమైంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తమకు న్యాయం చేయాలని వాపోయింది.

తప్పుడు డెత్, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్‌తో విక్రయించిన అనుపట్ల శ్రీనివాస్‌కు చెందిన భూమి

జగిత్యాలలో భూ అక్రమార్కుల జోరు

- ఏకంగా బతికున్న మనిషికి డెత్ సర్టిఫికెట్
- మేనమామను కన్నతండ్రిగా మార్చి భూమిని అమ్మేశారు
- భార్య, కొడుకు ఉన్నా.. లేనట్టు చూపారు
- కంగుతిన్న బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు
- న్యాయం చేయాలని వేడుకోలు

జగిత్యాల, జూన్ 20(నమస్తే తెలంగాణ): జగిత్యాలలో భూకబ్జారాయుళ్ల జోరు కొనసాగుతూనే ఉంది. ఖాళీ భూమి కనిపిస్తే చాలు పాగా వేసుకుంటూ పోతుండడం కలకలం రేపుతున్నది. పెండ్లి కాకుండానే మృతి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి ఓ భర్తను, ఓ కూతురును సృష్టించి ఆమె ఇంటినే సొంతం చేసుకున్నారన్న ఘటన మరువకముందే మరో భూ బాగోతం బయటపడింది. వివరాల్లోకి వెళితే.. రాయికల్ మండలం వస్తాపూర్‌కు చెందిన అనుపట్ల పోషయ్య, అనుపట్ల శ్రీనివాస్ ఇద్దరు అన్నదమ్ములు. ఇద్దరు వివాహితులే. శ్రీనివాస్‌కు భార్య లక్ష్మి, కొడుకు అనుపట్ల ప్రశాంత్ కుమార్ ఉన్నారు. పోషయ్యకు భార్య నర్సమ్మ ఉండగా, పిల్లలు లేరు. శ్రీనివాస్ 2010లో రాయికల్ మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 1057/ఇలో 680 చదరపు గజాల స్థలాన్ని (డ్యాకుమెంట్ నెంబర్ 3222/2010) కొనుగోలు చేశాడు. అయితే దురదృష్టవశాత్తు 2010 డిసెంబర్ 10న శ్రీనివాస్ గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో ఆయన భార్య లక్ష్మి, కొడుకు ప్రశాంత్‌ను తీసుకొని తన బంధువులు ఉన్న పూడూరు గ్రామానికి వెళ్లి అక్కడే జీవిస్తున్నది.

బతికుండగానే డెత్ సర్టిఫికెట్

శ్రీనివాస్ అన్న పోషయ్యకు సంతానం లేకపోవడంతో ఆయన తన అక్క కూతురు అయిన బూర్గుల శారదను పెంచుకున్నాడు. అయితే బూర్గుల శారద, ఆమె కుటుంబ సభ్యులు రాయికల్‌లో శ్రీనివాస్ కొనుగోలు చేసిన 680 చదరపు గజాల స్థలంపై కన్నేశారు. ఆ జాగను ఎలాగైనా దక్కించుకోవాలని ప్లాన్ వేశారు. చట్ట ప్రకారం శ్రీనివాస్ కొన్న భూమికి ఆయన భార్య లక్ష్మి, ఆయన కొడుకు ప్రశాంత్ హక్కుదారులుగా ఉన్నారు. అయితే వారు స్థానికంగా ఉండకపోవడంతో శారద, మరికొందరు కలిసి కుట్రకు తెరలేపారు. బతికి ఉన్న శ్రీనివాస్ భార్య అనుపట్ల లక్ష్మి చనిపోయినట్టుగా డెత్ సర్టిఫికెట్‌ను సృష్టించారు. లక్ష్మి 2017 మార్చి 2న చనిపోయినట్టు జగిత్యాల మున్సిపల్ కార్యాలయం (సర్టిఫికెట్ నంబర్ ఐడీ 281287-డి-78) జారీ చేసినట్టుగా ఉన్న సర్టిఫికెట్‌ను తెచ్చారు. తదుపరి రాయికల్ తహసీల్ ఆఫీస్ నుంచి (ఎఫ్ఎంసీఓ-2220118192 తేదీ 12.08.2019) జారీ చేసినట్లుగా ఉన్న ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను తెచ్చారు. ఈ ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో లక్ష్మి చనిపోయిందని, శ్రీనివాస్-లక్ష్మికి బూర్గుల శారద ఒకతే కూతురు ఉందని, ఆమెనే లీగల్‌గా హక్కుదారు అన్నట్టు చూపారు. ఈ సర్టిఫికెట్ల ఆధారంగా శ్రీనివాస్ కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు కుట్ర చేశారు.

ఇద్దరి పేరిట రిజిస్ట్రేషన్

బతికున్న లక్ష్మిని చనిపోయినట్టు చూపారు. ఇంకా శ్రీనివాస్-లక్ష్మికి పుట్టిన కొడుకు ప్రశాంత్ కుమార్ ఉండగా, ఆయనను రికార్డుల నుంచి తొలగించి, శ్రీనివాస్ మేనకోడలు అయిన బూర్గుల శారదను కూతురుగా పత్రాలు సృష్టించారు. వీటి ఆధారంగా 680 చదరపు గజాల స్థలాన్ని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారు. కట్కం సాయికుమార్ సన్ ఆఫ్ భూమానందం అనే వ్యక్తికి బూర్గుల శారద, శ్రీనివాస్ కుమార్తె హోదాలో జనవరి 5న జగిత్యాల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 242 చదరపు గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసింది. 106/2024 డాక్యుమెంట్ నంబర్ ద్వారా క్రతువు పూర్తి చేసింది. అదే రోజున 107/2024 డాక్యుమెంట్ ద్వారా మరో 395.22 చదరపు గజాల స్థలాన్ని తనను పెంచుకున్న అనుపట్ల నర్సమ్మ భర్త పోషయ్యకు రిజిస్ట్రేషన్ చేసింది. ఈ రెండు రిజిస్ట్రేషన్లకు పడిగెల నర్సింహ, మారంపెల్లి రవి కుమార్ అనే ఇద్దరు వ్యక్తులను సాక్షులుగా బూర్గుల శారద రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నమోదు చేయించింది.

బాధితులు షాక్.. ఠాణాలో ఫిర్యాదు

శ్రీనివాస్ మేనకోడలైన శారద ఆయనకు కన్నబిడ్డను అని, బతికున్న తాను చనిపోయానని తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి భూమిని ఇతరులకు విక్రయించిన విషయం తెలుసుకున్న శ్రీనివాస్ భార్య లక్ష్మి బిత్తరపోయింది. లక్ష్మితో పాటు ఆమె కొడుకు ప్రశాంత్ సైతం ఆందోళనకు గురయ్యారు. తన భర్త కష్టపడి కొనుగోలు చేసిన భూమిని తాము లేకుండా చూసి, ఫేక్ సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవడాన్ని లక్ష్మి, ఆమె కొడుకు ప్రశాంత్ జీర్ణించుకోలేకపోయారు. పూడూరు నుంచి రాయికల్‌కు వచ్చిన వారు భూమి విక్రయానికి సంబంధించిన వివరాలు సేకరించారు. జగిత్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి నకలు పత్రాలను తీసుకొని రాయికల్ ఠాణాలో ఈ నెల 8వ తేదీన ఫిర్యాదు చేశారు. అనుపట్ల శ్రీనివాస్ భార్య, కొడుకును అయిన తమకు తెలియకుండా తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన బూర్గుల శారద, కొనుగోలు చేసిన కట్కం సాయికుమార్, అనుపట్ల నర్సమ్మ, సాక్షులుగా వ్యవహరించిన నర్సింహ, రవికుమార్‌లపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని పోలీసులకు విన్నవించారు.

చర్యలు లేకపోవడంపై విమర్శలు

అక్రమంగా భూమిని రిజిస్ట్రేషన్ చేసిన విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా వేగవంతంగా చర్యలు తీసుకున్నట్లు కనబడడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఫిర్యాదు చేసి దాదాపు పన్నెండు రోజులు గడిచిపోయినా విచారణ జరపలేదని, నిందితులను అదుపులోకి తీసుకోలేదని ఫిర్యాదుదారు ప్రశాంత్ కుమార్ ఆరోపిస్తున్నాడు. బతికున్న తన అమ్మ డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేస్తున్నామంటూ రోజులు గడుపుతున్నారే గాని, ఇంత వరకు అరెస్ట్, విచారణ జరగలేదని ఆయన వాపోయారు. కాలయాపన చేయడంతో కేసులో ముద్దాయిలుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు ఇప్పటికే అబ్‌స్కాండింగ్ అయ్యారని, వారు యాంటిసిపేటరీ బెయిల్ తీసుకునేందుకు హైదరాబాద్‌కు వెళ్లినట్టు తమకు సమాచారం ఉందని పేర్కొన్నారు.

పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నాం

తప్పుడు సర్టిఫికెట్లతో తమ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారంటూ అనుపట్ల ప్రశాంత్‌కుమార్ ఈ నెల 8న ఫిర్యాదు చేశారు. దానిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, విచారణ ప్రారంభించాం. జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో అనుపట్ల లక్ష్మి డెత్ సర్టిఫికెట్‌పై వివరాలు ఇవ్వాలంటూ లేఖ ఇచ్చాం. అలాగే రాయికల్ తహసీల్ కార్యాలయంలోనూ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు సంబంధించిన వివరాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు అఫీషియల్‌గా లెటర్ ఇచ్చాం. రెండు శాఖల నుంచి వివరాలు అందగానే చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదుదారుడు ఆరోపించినట్టు కేసు దర్యాప్తులో ఎలాంటి జాప్యం చేయడం లేదు. కచ్చితమైన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తాం.

- అజయ్, రాయికల్ ఎస్ఐ

'నమస్తే' సంచలనం

- ప్రకంపనలు రేపుతున్న కథనాలు
- అక్రమార్కులకు ముచ్చెమటలు
- తాజాగా 'భూకబ్జారాయుళ్లా మజాకా'పై జోరుగా చర్చ
- రెవెన్యూ, మున్సిపల్ శాఖల్లో కలవరం

జగిత్యాల, జూన్ 20 (నమస్తే తెలంగాణ): జగిత్యాల జిల్లాలో కొన్నాళ్లుగా భూకబ్జాలు పెరిగిపోయిన విషయం తెలిసిందే కాగా, 'నమస్తే తెలంగాణ' ఒక్కొక్కటిగా వెలుగులోకి తెస్తున్నది. ఇటీవల జగిత్యాల శివారులో 12 గుంటల భూమిని తప్పుడు పత్రాల ద్వారా కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నించగా, 'జగిత్యాల మున్సిపాలిటీలో భారీ భూభాగోతం' శీర్షికన ప్రచురించి కథనం సంచలనం సృష్టించింది. దీంతో జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఆర్ ఐ, మరో ముగ్గురిపై కేసు నమోదు చేయడం అక్రమార్కులకు వణుకు పుట్టించింది. తాజాగా మరో కథనం ప్రకంపనలు రేపుతున్నది. చనిపోయిన ఓ అవివాహిత ప్రభుత్వోద్యోగికి బిడ్డను సృష్టించి, తప్పుడు పత్రాలతో భూ రిజిస్ట్రేషన్ చేసిన తీరుపై 'కబ్జారాయుళ్లా.. మజాకా..?' శీర్షికన గురువారం ప్రచురితమైన కథనం వివిధ శాఖల్లో కలవరం సృష్టించింది. తప్పుడు డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లతో జరిపిన రిజిస్ట్రేషన్ వ్యవహారాన్ని కండ్లకు కట్టింది. దీంతో మున్సిపల్, రెవెన్యూశాఖల అధికారులు తమ రికార్డులను పరిశీలించుకునే పనిలో పడినట్టు తెలుస్తున్నది. ఇక రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారులు సైతం దీనిపై అంతర్గతంగా విచారణ జరుపుతున్నట్టు సమాచారం. కాగా, భూకబ్జాకు పాల్పడిన వ్యక్తుల లీలలను బట్టబయలు చేస్తూ వచ్చిన కథనం ప్రజాప్రతినిధుల్లో సైతం చర్చనీయాంశంగా మారింది. రిజిస్ట్రేషన్‌కు సంబంధం ఉన్న వివిధ శాఖల అధికారులు విచారణకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. బాధితుల నుంచి లిఖిత పూర్వంగా ఫిర్యాదు అందింతే చర్యలు తీసుకుంటామని అధికారం యంత్రాంగం స్పష్టం చేస్తున్నది.

తెల్ల వెంట్రుకలకు వైద్యం చేస్తం.. లోన్ ఇస్తం

కరీంనగర్‌లో వెలుగుచూసిన మోసం

విద్యానగర్, జూన్ 20 : తెల్ల వెంట్రుకలకు వైద్యం చేస్తామని.. అందుకు అవసరమైన డబ్బుల కోసం లోన్ ఇప్పిస్తామని మోసం చేసిన ఘటన గురువారం కరీంనగర్‌లో వెలుగుచూసింది. కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి తల వెంట్రుకలు తెల్లబడుతున్నాయని చికిత్స కోసం కోర్టు దగ్గర గల ఓ క్లినిక్ వెళ్లాడు. అక్కడ యజమాన్యం ఎక్కువ మొత్తంలో ఖర్చవుతుందని తెలిపింది. డబ్బులు లేకపోతే లోన్ ఇప్పిస్తామని నమ్మకం కల్పించి చికిత్స చేయకుండానే అధిక మొత్తంలో వసూలు చేశారు. నమ్మించి మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి బాధిత కుటుంబ సభ్యులు గురువారం ఫిర్యాదు చేశారు.

అప్పు తీర్చేందుకు చైన్‌స్నాచింగ్

రాంనగర్, జూన్ 20 : అప్పు తీర్చేందుకు ఇచ్చిన వ్యక్తితో కలిసి తీసుకున్న వ్యక్తి ఈ నెల 15న నగరంలోని మెహర్‌నగర్‌లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను త్రీటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి. మెహర్‌నగర్ ప్రాంతం లో ఈ నెల 15న సందూరి లక్ష్మి ఇంటి ముందు పూలు కోస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి పుస్తెల తాడు లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనలో లక్ష్మి గట్టిగా పట్టుకోవడంతో పుస్తెల తాడు సగం తెగి పడిపోయింది. నిందితులిద్దరూ చాకచక్యంగా తప్పించుకొని పరారయ్యారు. ఈ ఘటనపై లక్ష్మి కొడుకు రవీందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీసీ కెమెరాల ఆధారంగా క్రైం పార్టీ పోలీసులు నిందితులను గుర్తించారు. స్నాచింగ్‌కు పాల్పడిన నిందితులిద్దరూ ఐదు రోజులపాటు దాక్కొని గురువారం పుస్తెల తాడును విక్రయించి సొమ్ము చేసుకుందామని బయటికి వచ్చారు. ఈ క్రమంలో ఆదర్శనగర్ చౌరస్తా వద్ద బైక్‌పై వెళ్తున్న ఇద్దరినీ క్రైం పార్టీ పోలీసులు తనిఖీ చేయగా చైన్ స్నాచింగ్ విషయం వెలుగుచూసింది. వెంటనే నిందితులిద్దరిని అదుపులోకి తీసుకుని బంగారాన్ని రికవరీ చేశారు. పట్టుబడ్డ నిందితులు విద్యానగర్‌కు చెందిన పున్నం శ్రీనివాస్, సాయినగర్‌కు చెందిన అందె శ్రీనివాస్‌గా గుర్తించారు. పున్నం శ్రీనివాస్ ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లిన సమయంలో అందె శ్రీనివాస్ డబ్బు అప్పుగా ఇచ్చాడు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో అందె శ్రీనివాస్ ఒత్తిడి చేయడంతో ఇద్దరు కలిసి చోరీలకు పాల్పడుదామని నిర్ణయించుకొని చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు పోలీసుల విచారణలో అంగీకరించారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

వాణిజ్య

AMARA RAJA
Gotta be a better way

ఇనోబ్యాట్‌లో పెరిగిన అమర రాజా వాటా

హైదరాబాద్, జూన్ 20: నార్వేకు చెందిన ఇనోబ్యాట్ ఏఎస్‌లో వాటాను మరింత పెంచుకున్నది అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ సంస్థ. కొత్తగా 4.5 శాతం వాటాను కొనుగోలు చేయడానికి 20 మిలియన్ల యూరోల (రూ.180 కోట్లకు పైమాటే) పెట్టుబడి పెట్టింది. దీంతో సంస్థలో అమర రాజా వాటా 9.32 శాతానికి చేరుకున్నది. గతంలో 10 మిలియన్ యూరోల పెట్టుబడి పెట్టిన విషయం తెలిసిందే.

డాలర్ ముందు రుపీ వెలవెల

ఒకానొక దశలో ఆల్‌టైమ్ లో.. 27 పైసలు క్షీణత

17 పైసలు పడిపోయి 83.61 వద్దకు • 2 నెలలకుపైగా కనిష్ఠానికి పతనం

ముంబై, జూన్ 20: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 2 నెలలకుపైగా కనిష్ఠ స్థాయిని తాకింది. గురువారం ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం ఆరంభం నుంచే దేశీయ కరెన్సీ.. అమెరికా డాలర్ ముందు చతికిల పడుతూ వచ్చింది. ఈ క్రమంలోనే ఒకానొక దశలో ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఏకంగా 27 పైసలు దిగజారి మునుపెన్నడూ లేనివిధంగా 83.68 స్థాయికి వెళ్లింది. అయితే మళ్లీ కోలుకోవడంతో 10 పైసలు బలపడింది. చివరకు బుధవారం ముగింపుతో చూస్తే 17 పైసలు క్షీణించి 83.61 వద్ద స్థిరపడింది. ఈ ఏడాది ఏప్రిల్ 16న కూడా ఇదే స్థాయి వద్ద నిలిచిన విషయం తెలిసిందే.

క్రూడ్ సెగ

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం.. రుపీని ప్రభావితం చేసింది. మిడిల్ ఈస్ట్ దేశాల్లో రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలు.. క్రూడ్ రేట్లను ఎగదోశాయి. ఈ క్రమంలోనే దేశీయ స్టాక్ మార్కెట్లు పెరిగినా ఆ జోష్‌ను రుపీ అందుకోలేకపోయింది. విదేశీ పెట్టుబడులు ఈక్విటీలోకి వచ్చినా రుపీపై ఒత్తిడి తగ్గలేదని ఫారెక్స్ ట్రేడర్లు సైతం విశ్లేషిస్తున్నారు. నిజానికి ఉదయం ఆరంభంలో 83.43 వద్ద మొదలైన రుపీ.. ఒకానొక దశలో 83.42కు బలపడింది. బుధవారం 83.44 వద్ద ముగిసిన సంగతి విదితమే.

ఇది కొనసాగితే..

రుపీ నష్టాలు ఇదే స్థాయిలో కొనసాగితే దేశీయ దిగుమతులపై ఆ ప్రభావం పెద్ద ఎత్తున ఉంటుంది. ద్రవ్యోల్బణాన్ని ఎగదోసి.. దేశ ఆర్థిక వ్యవస్థనే చిక్కుల్లో పడేయగలదు. వాస్తవానికి ఆర్బీఐ.. రుపీ ట్రేడింగ్‌లో జోక్యం చేసుకుంటూనే ఉంటుంది. అయినప్పటికీ దేశ, విదేశీ పరిణామాలు షేక్ చేస్తూనే ఉన్నాయి. అయితే దేశంలో పెరుగుతున్న ఫారెక్స్ రిజర్వులు కొంతలో కొంత ఊరటగా చెప్పుకోవచ్చని మెజారిటీ నిపుణులు మాట.



తెలుగు రాష్ట్రాల్లో జియో దూకుడు

హైదరాబాద్, జూన్ 20: టెలికం దిగ్గజం రిలయన్స్ జియో దూసుకుపోతున్నది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో తెలుగు రాష్ట్రాల్లో కంపెనీ నెట్‌వర్క్‌లోకి కొత్తగా 1.56 లక్షల మంది చేరారు. టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 1,56,296 మంది నూతన సబ్‌స్క్రైబర్లు చేరడంతో మొత్తం సంఖ్య 3.29 కోట్లకు చేరుకున్నారు.

ఓలా ఐపీవోకి గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, జూన్ 20: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ఓలా ఎలక్ట్రిక్..ఐపీవోకి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బహిరంగ మార్కెట్లో ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన 9.52 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుండటంతో రూ.5,500 కోట్ల నిధులను సేకరించాలని సంస్థ సంకల్పించింది. దీంతోపాటు ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్ ఐపీవోకి కూడా అనుమతినిచ్చింది. ఈ రెండు సంస్థలు గతేడాది డిసెంబర్‌లోనే దరఖాస్తు చేసుకున్నాయి.

హైదరాబాద్‌లోకి సెంట్రీసిటీ

హైదరాబాద్, జూన్ 20: వెల్త్‌టెక్ స్టార్టప్ సెంట్రీసిటీ.. తాజాగా హైదరాబాద్‌లోకి అడుగుపెట్టింది. దక్షిణాది మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించడంలో భాగంగానే హైదరాబాద్‌లో కొత్త కార్యాలయాన్ని గురువారం ప్రారంభించింది. ఇప్పటికే సంస్థకు దేశవ్యాప్తంగా ఎనిమిది చోట్ల కార్యాలయాలు ఉన్నాయి. ఈ నూతన ఆఫీస్ కోసం ప్రతిభ కలిగిన ఉద్యోగులను తీసుకునే పనిలో పడింది సంస్థ.

ఎయిర్ ఇండియాతో జూమ్‌కార్ జట్టు

ముంబై, జూన్ 20: సెల్ఫ్ డ్రైవ్ కార్ షేరింగ్ ప్లాట్‌ఫాం సేవల సంస్థ జూమ్‌కార్..ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌తో జట్టుకట్టింది. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంతో హైదరాబాద్‌తో పాటు 19 విమానాశ్రయాల్లో నేరుగా సెల్ఫ్-డ్రైవ్ కారును బుకింగ్ చేసుకునే వీలుంటుంది. విమానాశ్రయాల్లో దిగిన తర్వాత క్యాబ్ కోసం వేచి చూడాల్సిన అవసరం లేదని, ఎయిర్‌లైన్స్‌కు చెందిన మొబైల్ యాప్ ద్వారానే తమకు నచ్చిన కారును బుకింగ్ చేసుకునే వీలుంటుంది.

స్విస్ బ్యాంకుల్లో తగ్గిన డిపాజిట్లు

2023లో 70 శాతం దిగి రూ.9,771 కోట్లకు..

న్యూఢిల్లీ, జూన్ 20: స్విస్ బ్యాంకుల్లో భారతీయులు, దేశీయ సంస్థల డిపాజిట్లు మరింత తగ్గాయి. వరుసగా రెండో ఏడాది 2023లోనూ స్విస్ బ్యాంకుల్లో డిపాజిట్లు 70 శాతం తగ్గి నాలుగేండ్ల కనిష్ఠ స్థాయి రూ.9,771 కోట్ల(1.04 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్)కు పరిమితమయ్యాయని స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంక్ విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. 2021లో 14 ఏండ్ల గరిష్ఠ స్థాయి 3.83 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్‌కి చేరుకున్న డిపాజిట్లు ఆ తర్వాత వరుసగా రెండేండ్ల పాటు తగ్గుముఖం పట్టడం విశేషం. బాండ్లు, సెక్యూరిటీ, ఇతర ఆర్థిక మార్గాల ద్వారా వచ్చిన పెట్టుబడుల ఆధారంగా సెంట్రల్ బ్యాంక్ ఈ నివేదికను రూపొందించింది. అయినప్పటికీ స్విట్జర్లాండ్‌లో భారతీయులు కలిగివున్న నల్లధనం ఎంత అనేది ఇప్పటికీ తెలియరాలేదు. ఇండియన్స్, ఎన్ఆర్ఐలు లేదా ఇతరులు స్విస్ బ్యాంకుల్లో ఇతర దేశాలకు చెందిన సంస్థల పేర్లతో పెట్టిన డిపాజిట్లను ఈ గణాంకాల్లో చేర్చలేదు. 2006లో రికార్డు స్థాయిలో 6.5 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్ డిపాజిట్లు ఉండగా, ఆ తర్వాతి తగ్గుముఖం పట్టాయని తన నివేదికలో వెల్లడించింది.

- 2020లో 39 శాతం పెరిగిన దేశీయ డిపాజిట్లు, 2021లో 8 శాతం అధికమవగా, 2022లో మాత్రం 18 శాతం తగ్గాయి.
- డిపాజిట్లలో బ్రిటన్ తొలిస్థానంలో నిలిచింది. 254 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్ డిపాజిట్లు కలిగివున్నది. ఆ తర్వాతి స్థానంలో అమెరికా(71 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్), ఫ్రాన్స్(64 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్) ఉన్నాయి.
- ఆ తర్వాతి స్థానాల్లో వెస్టిండీస్, జర్మనీ, హాంకాంగ్, సింగపూర్, లగ్జంబర్గ్ దేశాలున్నాయి.
- 2022లో 46వ స్థానంలో ఉన్న భారత్ ర్యాంక్.. ఈసారికిగాను 67వ స్థానానికి పడిపోయింది.
- మొత్తంగా 2022లో 1.15 ట్రిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌గా ఉన్న డిపాజిట్లు 2023లో 983 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌లకు తగ్గాయి.

తగ్గిన ఎఫ్‌డీఐలు.. పడిపోయిన ర్యాంక్

న్యూఢిల్లీ, జూన్ 20: విదేశీ పెట్టుబడులు ఆకట్టుకోవడంలో భారత్ నిరాశాపరుస్తున్నది. 2023లో దేశంలోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఏడాది ప్రాతిపదికన 43 శాతం తగ్గి 28 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దీంతో వరల్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ర్యాంకింగ్‌లో భారత ర్యాంక్ 15వ స్థానానికి పడిపోయిందని ఐక్యరాజ్యసమితి కాన్ఫరెన్స్ ఆఫ్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్(యూఎన్‌సీటీఏడీ) తాజాగా విడుదలచేసిన నివేదికలో వెల్లడించింది. 2022లో భారత్‌లోకి వచ్చిన 48 బిలియన్ డాలర్లతో 8వ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.

నేడు తైవాన్‌కు పరిశ్రమల శాఖ అధికారులు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సాధ్యమైనన్ని ఎక్కువ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల పరిశ్రమలను నెలకొల్పడమే లక్ష్యంగా పరిశ్రమల శాఖకు చెందిన అధికారుల బృందం శుక్రవారం తైవాన్‌కు వెళ్లనున్నది. విదేశీ పెట్టుబడులు ఆకట్టుకోవడమే లక్ష్యంగా పరిశ్రమల శాఖకు చెందిన ఉన్నతాధికారులు అక్కడి ఎలక్ట్రానిక్స్ వస్తువుల తోపాటు చిప్‌ల తయారీ రంగానికి చెందిన సంస్థల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలపై ప్రధానంగా వివరించనున్నారు.

ఇండ్లకు గిరాకీ నై

హైదరాబాద్‌లో ఈ త్రైమాసికం 20 శాతం తగ్గొచ్చని అంచనా



దేనికి సంకేతం?

ఇండ్ల అమ్మకాలపై ప్రాప్‌ఈక్విటీ పరిగణనలోకి తీసుకున్న నగరాల్లో ఒక్క హైదరాబాద్‌లోనే అత్యధికంగా డిమాండ్ పడిపోతున్నట్టు తేలడం గమనార్హం. నిజానికి ఎప్పుడూ హైదరాబాద్‌లో నివాసాలకు కొనుగోలుదారుల నుంచి పెద్ద ఎత్తునే ఆసక్తి కనిపించేది.

- *గత ఏడాది ఏప్రిల్-జూన్‌లో దేశంలోని 9 నగరాల్లో 1,21,856 యూనిట్ల ఇండ్ల అమ్మకాలు జరిగాయి. అయితే 2 శాతం తగ్గి ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో 1,19,901 యూనిట్లకే పరిమితం కావచ్చంటున్న ప్రాప్‌ఈక్విటీ.*
- *ఈ జనవరి-మార్చి అమ్మకాలతో చూస్తే 18 శాతం పడిపోనున్నాయి. నాడు 1,46,194 ఇండ్ల విక్రయాలు జరిగాయి.*
- *హైదరాబాద్, పుణెల్లో హౌజింగ్ సేల్స్‌కు డిమాండ్ లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని ప్రాప్‌ఈక్విటీ విశ్లేషించింది.*
- *మొత్తం 9 నగరాల్లో పుణె, హైదరాబాద్‌ల్లో మాత్రమే గతంతో పోల్చితే ఇండ్ల అమ్మకాలు క్షీణిస్తాయని ప్రాప్‌ఈక్విటీ చెప్తున్నది. అయితే బెంగళూరు, ముంబై, చెన్నైల్లో యథాతథం.*
- *నవీ ముంబై, కోల్‌కతాల్లో ఆకర్షణీయ వృద్ధి నమోదయ్యేందుకు వీలున్నది. థానె, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లలోనూ చెప్పుకోదగ్గరీతిలోనే నివాస విక్రయాలు పెరగవచ్చు.*

న్యూఢిల్లీ, జూన్ 20: గత ఏడాది వరకు హైదరాబాద్ ఇండ్ల కోసం ఎగబాడినవారంతా ఇప్పుడు సైలెంటైపోయినట్టు కనిపిస్తున్నది. ప్రముఖ రియల్ ఎస్టేట్ డాటా అనలిటిక్ సంస్థ ప్రాప్‌ఈక్విటీ అంచనా